క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పాలకొండ ఎస్‌ఐ రమణ

ఆమదాలవలస: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పాలకొండ ఎస్‌ఐ ఎస్.వి. రమణ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆమదాలవలస గేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా గత 12 ఏళ్లుగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషదాయకమన్నారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేసిన నిర్వాహకులు మెండ శ్రీనివాసరావు, శంకర్ ప్రసాద్, కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జి.ఏసయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



నీలమణిదుర్గమ్మ అమ్మవారు

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణిదుర్గమ్మవారి శోభాయాత్ర ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆలయంలో జరుగుతున్న వసంత త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



సర్పంచ్ సాధుబాబుకు రూ.లక్ష అందజేస్తున్న ఉపాధ్యాయుడు రామరాజు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో నిర్మిస్తున్న భీమలింగేశ్వర ఆలయానికి అదే కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు పల్లి రామరాజు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఆదివారం అందజేశారు. తన తల్లి సరస్వతమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధి, సర్పంచ్ పెదకోట సాధుబాబుకు అందజేసినట్లు రామరాజు తెలిపారు. రూ.60 వేలు విఘ్నేశ్వర విగ్రహానికి, రూ.40 వేలు ఆలయ నిర్మాణానికి ఖర్చు చేయాలని కోరామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఔదార్యం..



వడితాన సాయమ్మకు రూ.20 వేల చెక్‌ను అందజేస్తున్న రాజు, ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన చెందిన భగత్‌సింగ్ చారటబుల్ ట్రస్టు సభ్యులు ఔదార్యాన్ని చాటుకున్నారు. కొత్తూరు, భామిని, పాతపట్నం మండలాలకు చెందిన ఐదుగురికి ఒంగ్రుజోలకు చెందిన సామాజికవేత్త బామిడి రాజు చేతుల మీదుగా ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కొత్తూరుకు చెందిన వృద్ధురాలు వడితాన సాయమ్మ ఇంటి వద్ద పనులు చేసుకుంటూ జారిపడిపోవడంతో కాలు విరిగింది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలను అందజేశారు. కొత్తూరుకు చెందిన బోడమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు వైద్యం చేయించడంతోపాటు ప్రతీరోజు ఆహారం అందిస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు. దిమిలి గ్రామానికి చెందిన రాగాల పవన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పవన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల చెక్‌ను అందజేశారు. భామిని మండలానికి చెందిన మువ్వల నూకరాజు బైక్ ప్రమాదంలో గాయపడటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల చెక్‌ను అందించారు. పాతపట్నం మండలం చంగుడ గ్రామానికి చెందిన ఎస్.దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో పనులు చేస్తుండగా ఇంటి పైనుంచి జారిపడ్డారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల చెక్‌ను ట్రస్టు సభ్యులు అందజేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఆమదాలవలస: పట్టణంలోని భారతీయ జనతా పార్టీ నియోజకవర్గం కార్యాలయ ఆవరణలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరప్పు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు గురుగుబెల్లి వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పాతిన గడ్డయ్య, మున్సిపల్ నాయకులు ధనుంజయరావు, శ్రీధర్, రాము, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస ఆర్‌ఆర్ కాలనీలోని రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, గ్రామస్తులు



హిరమండలం: సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు



కొత్తూరు: రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే..

శ్రీరామ నవమి పురస్కరించుకుని పల్లెలు, పట్టణాల్లో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించింది. పచ్చటి పందిళ్లు.. స్వాగత తోరణాలు.. విద్యుత్ వెలుగులు కనువిందు చేశాయి. ఆలయాల్లో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు. పలుచోట్ల సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పోలాకి: రామ మందిరంలో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు



నరసన్నపేట: భవానీపురంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సారవకోట: సీతారాముల ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: పెద్దలంబలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస: ఎస్సార్పీపేటలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవి వేడుకలు



నరసన్నపేట: జట్టు కలాసీ సంఘం నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు



సరుబుజ్జిలి: మర్రిపాడులో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



బూర్జ: ఓవీ పేట కోదండరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తూరు: పారాపురంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



పొందూరు: లైదాం శివానంద ధర్మక్షేత్రంలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



హిరమండలం: చొర్లంగి రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: కాగువాడ రామాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



ఎల్.ఎన్.పేట: చింతలబడవంజలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

● అడుగంటినది



బూర్జ మండలంలో నాగావళి నది ఎడారిని తలపిస్తోంది. పశువులు, మేకలు, గొర్రెలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నాయి. నది ఎగువ భాగాన తగినంతగా వర్షాలు లేకపోవడంతో నీరు అడుగంటింది. ఏప్రిల్, మే నెలల్లో నదిలో నీరు పూర్తిగా ఇంకిపోయే ప్రమాదం ఉందని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- బూర్జ

● తరగతి గది వరండాలో ధాన్యం బస్తాలు



సారవకోట మండలంలోని మదనాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ తరగతి గది ఆవరణలో ధాన్యం బస్తాలను గ్రామానికి చెందిన రైతులు నిల్వ చేశారు. పాములు, ఇతర విష జంతువులు చేరే ప్రమాదం ఉందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- సారవకోట

రెడ్డి శాంతికి అభినందనలు

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా ఇటీవల నియామకమైన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ఆదివారం పలువురు అభినందించారు. పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో దుక్క శ్రీకాంత్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. పనుకు మోహన్, కంబుమహంతి జీవేశ్వరరావు, సందీప్ ఉన్నారు.



రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్ రెడ్డి, తదితరులు

23, 24 తేదీల్లో కరగాం జాతర



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: ఈ నెల 23, 24వ తేదీల్లో మండలంలోని కరగాం గ్రామంలో గల షిరిడీ సాయి బాబా మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. గ్రామ అమ్మవారి గుడి వద్ద గోడ పత్రికలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్, తిరువీధి, పారాయణం, భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, 24న అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అడుగంటాయి..



అడుగంటిన రంగసాగరం

- రోజురోజూకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- చుక్క నీరులేని సాగునీటి వనరులు
- పశు, పక్ష్యాదులకు తాగునీటి ఇక్కట్లు

సారవకోట: ఏప్రిల్ మొదటి వారంలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే చెరువులు, సాగునీటి వనరులు పూర్తిగా ఎండిపోయాయి. పశు, పక్ష్యాదులకు తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. సారవకోట, పాటపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, జలుమూరు మండలాల చుట్టూ ఎత్తైన కొండలు, రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా ఉండటంతో అనేక వన్య ప్రాణులున్నాయి. వీటికి తాగు నీటి సమస్య తలెత్తడంతో ఇప్పటికే జింకలు, దుప్పులు, కొండ గొర్రెలు తాగునీటి కోసం గ్రామాల శివారు ప్రాంతాలకు వచ్చి కుక్కల దాడిలో మృతి చెందిన ఘటనలు ఈ మండలాల్లో అధికంగా కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న పశువులకు, వన్య ప్రాణులకు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే ఎన్నో జీవాలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల నాటికే వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ తెలియజేసింది.



వాండ్రాయిలో చుక్క నీరులేని కోనేరు

నరసన్నపేట నియోజకవర్గంలో సాగునీటి చెరువుల వివరాలు..		
మండలం	పంచాయతీలు	మొత్తం చెరువులు
సారవకోట	35	252
జలుమూరు	41	231
పోలాకి	31	168
నరసన్నపేట	34	173

నీటి ఎద్దడి..

ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి మహారాజులు సారవకోట మండలంలో 350 ఎకరాల విస్తీర్ణంలో, పాతపట్నం మండలంలో 418 ఎకరాలలో రెండు కొండల మధ్యలో చెరువులు తవ్వించారు. వారు తవ్వించిన చెరువుల ద్వారా ఇప్పుడు కొన్ని వందల ఎకరాల పంటలకు సాగు నీరు అందుతుంది. దీంతో పాటు అనేక వన్య ప్రాణులు, పశు, పక్ష్యాదులకు తాగునీటిని అందిస్తున్నాయి. ఆనాడు వారి ముందు చూపుతో పాతపట్నం మండలంలోని తెంబూరులో గల అసర్ల సాగరం, సారవకోట మండలంలోని అర్లి సమీపంలో గల రంగసాగరాన్ని సాగు, తాగు నీటి కోసం తవ్వించారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి సరైన వర్షాలు లేక రబీలో వరి సాగు చేయడంతో ఆయకట్టు కింద ఉన్న రైతులు ఆయా చెరువులలో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో వినియోగించారు. దీనికి తోడు ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉండటంతో ఉన్న నీరు పూర్తిగా ఎండిపోయింది. ఈ రెండు చెరువుల పరిధిలోని పాడి రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి



గతేడాది వర్షాలు లేమి వలన పలు గ్రామాల్లోని చెరువులు ఎండిపోయాయి. గ్రామాల్లో పశు, పక్ష్యాదులకు తాగునీటి ఎద్దడి మొదలైంది. పాడి రైతులు తాగునీటి కోసం పశువులను సుదూర ప్రాంతాలకు తరలించావల్సి వస్తోంది. సమీపంలో ఉన్న కొండల నుంచి అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తున్నాయి.

- పోలాకి కేశవరావు, రైతులు, బెజ్జి, సారవకోట మండలం

నీటి తొట్టెలు ఏర్పాటు చేయిస్తున్నాం



పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం చేపడుతున్నాం. ఇప్పటికే బద్రి గ్రామంలో నీటి తొట్టెల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ధర్మలక్ష్మీపురంలో గతంలో నిర్మించిన నీటి తొట్టెలను స్థానికులు వినియోగించుకుంటున్నారు.

-పి.మోహన్‌కుమార్, ఎంపీడీఓ, సారవకోట

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి



సదాశివుని కృష్ణను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు

నరసన్నపేట: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుండాలని, జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని వైస్ గవర్నర్ కేవీ సుబ్బరాజు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో జిల్లా లయన్స్ క్లబ్ రీజనల్ కాన్ఫరెన్స్‌ను ఆదివారం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న సుబ్బరాజు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 10 లయన్స్ క్లబ్‌లతోపాటు నరసన్నపేట క్లబ్ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. చైతన్య కార్యక్రమాలు, ప్రజలకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. నరసన్నపేట క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు రమణ సాహూని అభినందించారు. నరసన్నపేట క్లబ్ సిల్వర్ జూబ్లీని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది పూర్వపు క్లబ్ అధ్యక్షులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వి.వి.రంగనాథ్, పూర్వపు గవర్నర్లు డి.వి..ఎస్.రాజు, ఎస్.ఎస్.వి.వర్మ, స్థానిక క్లబ్ ప్రతినిధులు కె.సాయిరాం, కోరాడ బుజ్జి, బాలగంగాధర్, వి.వి.సోమేశ్వరరావు, పూర్వపు క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.